క్లుప్తంగా

గోశాలలకు పశుగ్రాసం వితరణ



దాతలు వితరణగా ఇచ్చిన పశుగ్రాసం

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ స్వామి వారి సన్నిధిలోని గోశాలలోని పశువులకు దాతలు బుధవారం పశుగ్రాసాన్ని వితరణగా ఇచ్చారు. రాజమహేంద్రవరానికి చెందిన పద్మనాభుని వెంకట కొండలరావు, స్వర్ణలత దంపతులు 26 మోపుల ఎండుగడ్డిని అందజేశారు. ఈదరాడకు చెందిన కోన చిట్టిబాబు 20 మోపుల గడ్డిని వితరణగా ఇచ్చారు. దాతలను ఆలయ ఈఓ వి.సత్యనారాయణ, ఆలయ ఉద్యోగులు అభినందించారు.

నారసింహ, సుదర్శన హోమానికి పోటెత్తిన భక్తులు



అంతర్వేది గోశాలకు దాణా వితరణ చేసిన దాత, ప్రముఖులు

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామివారి ఆలయంలో బుధవారం జ్యేష్ఠా నక్షత్ర పర్వదినాన అర్చకులు నిర్వహించిన నారసింహ సుదర్శన హోమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. వేద పండితుడు చింతా వేంకటశాస్త్రి, అర్చకుడు ఎస్‌బీఎం రామకృష్ణమాచార్యులు హోమం నిర్వహించారు. హోమంలో పాల్గొన్న భక్తులకు అర్చకులు తీర్థ ప్రసాదాలను, ఆశీర్వచనాలు అందజేశారు.

గోశాలకు దాణా వితరణ

అంతర్వేది ఆలయ పరిధిలోని గోశాలకు పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లుకు చెందిన కుమార్ రైస్ ఇండస్ట్రీస్ అధినేత దేవరపు ఆనంద్ బాబు రూ.12,500 విలువ గల 20 బస్తాల దాణాను వితరణ చేశారు. ఈ మేరకు అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ సమక్షంలో దాత గోశాలకు దాణా అందజేశారు.

రత్నరాజుకు గొల్లపల్లి పరామర్శ



రత్నరాజును పరామర్శిస్తున్న మాజీ మంత్రి గొల్లపల్లి

మలికిపురం: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు బల్ల రత్నరాజును బుధవారం మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు పరామర్శించారు. మండలంలోని విశ్వేశ్వరాయపురంలో రత్నరాజు నివాసంలో పరామర్శించిన అనంతరం ఆయన త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. గ్రామ పార్టీ నాయకులు గుబ్బల వీవీ సత్యనారాయణ, దొండపాటి రాంబాబు, జిల్లెళ్ళ ఉదయ్‌కిరణ్, తదితరులు రత్నరాజును పరామర్శించిన వారిలో ఉన్నారు.

ప్రతిభ అవార్డు గ్రహీతకు సత్కారం



ప్రవళికను అభినందిస్తున్న మాజీ మంత్రి గొల్లపల్లి

రాజోలు: ఇంటర్మీడియెట్‌లో అత్యధిక మార్కులు సాధించి రాష్ట్ర ప్రభుత్వ ప్రతిభ అవార్డు అందుకున్న పొదలాడ గ్రామ వైఎస్సార్ సీపీ గ్రామశాఖ అధ్యక్షుడు లిఖితపూడి బుజ్జి కుమార్తె లిఖితపూడి ప్రవళికను మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు బుధవారం సత్కరించారు. ప్రతిభ అవార్డుతో పాటు ప్రశంసాపత్రాన్ని అందుకున్న ప్రవళిక భవిష్యత్‌లో మరిన్ని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని గొల్లపల్లి ఆకాంక్షించారు. నియోజకవర్గ నాయకులు కొల్లాబత్తుల సతీష్‌బాబు, ఉచ్చుల దాసు, బుంగ శ్రీను, కంబాల చంద్రబాబు, దొమ్మేటి సోమరాజు తదితరులు పాల్గొన్నారు.

యోగాంధ్రను విజయవంతం చేద్దాం

ఆలమూరు: ఈ నెల 21న రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించనున్న యోగా డేను విజయవంతం చేద్దామని ఎంపీడీఓ ఎ.రాజు కోరారు. మండలంలోని వివిధ గ్రామ సచివాలయాల్లో క్షేత్రస్థాయి సిబ్బంది నిర్వహిస్తున్న యోగాసనాల కార్యక్రమాలను బుధవారం ఆయన పరిశీలించారు. యోగా వల్ల కలిగే ప్రయోజనాలను వివరిస్తూ ప్రజలకు అభిరుచి కలిగే విధంగా శిక్షణను అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. పెదపళ్లలో గ్రామ కార్యదర్శి వి.వేణి, ఆరోగ్య సంరక్షణ కార్యదర్శి ఉమా మహేశ్వరి విద్యార్థులకు శిక్షణ అందజేశారు.

నిత్యాన్నదాన ట్రస్టుకు రూ.50 వేల విరాళం

మామిడికుదురు: అప్పనపల్లి బాలబాలాజీ ఆలయంలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన ట్రస్టుకు కాకినాడకు చెందిన శ్రీకృష్ణ నవదీర్ శర్మ బుధవారం రూ.50 వేలు విరాళంగా అందించారు. ఈ విరాళాన్ని ఆలయ పర్యవేక్షకుడు సత్యమూర్తికి అందించారు. దాతకు అర్చకులు వేద ఆశీర్వచనం అందించారు.

విద్యార్థులకు సమస్యల స్వాగతం

- నేటి నుంచి ప్రారంభం కానున్న పాఠశాలలు
- అసంపూర్తిగా స్కూల్ భవనాలు
- ఆందోళన వ్యక్తం చేస్తున్న పేరెంట్స్



మధ్యలోనే నిలిచిన లూటుకుర్రు స్కూల్ భవనం



కొట్టుమెరకలో అసంపూర్తిగా ప్రాథమిక పాఠశాల భవనం

మామిడికుదురు: వేసవి సెలవుల అనంతరం గురువారం నుంచి స్కూల్స్ పునః ప్రారంభం కాబోతున్నాయి. పాఠశాలలకు వస్తున్న విద్యార్థులకు ఎన్నో సమస్యలు స్వాగతం పలుకుతున్నాయి. స్కూల్ భవనాల నిర్మాణం పనులు మధ్యలోనే నిలిచిపోవడంతో మండలంలో పలు చోట్ల అటు విద్యార్థులు, ఇటు టీచర్లు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కొన్ని చోట్ల పరాయి పంచన స్కూల్స్ నిర్వహిస్తుండగా మరికొన్ని చోట్ల అంతంత మాత్రంగానే ఉన్న అరకొర సదుపాయాల నడుమ స్కూల్స్‌ను రన్ చేస్తున్న పరిస్థితి.

మండలంలో ఇదీ పరిస్థితి..

మామిడికుదురు మండలంలో మొత్తం 71 స్కూళ్లు ఉన్నాయి. వాటిలో 58 ప్రాథమిక పాఠశాలలు ఉన్నాయి. 13 జెడ్పీహెచ్ స్కూళ్లు ఉన్నాయి. మండలంలో మొత్తం 33,073 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. వారికి అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించే దిశగా తీసుకుంటున్న చర్యలు నామమాత్రంగా ఉన్నాయన్న విమర్శలు పేరెంట్స్ నుంచి వినిపిస్తున్నాయి. ప్రధానంగా అసంపూర్తిగా నిలిచిన భవన నిర్మాణాలే ప్రధాన సమస్యగా మారాయని వాపోతున్నారు.

అసంపూర్తి భవనాల చిట్టా ఇదీ..

మగటపల్లి బాలాజీనగర్‌లో అంగన్‌వాడీ భవనం శ్లాబ్ వేసి వదిలేశారు. లూటుకుర్రు ప్రధాన ప్రాథమిక పాఠశాలలో రెండంతస్తుల భవనానికి కింది అంతస్తు శ్లాబ్ వేశారు. గుమ్మాలు, కిటికీల ఏర్పాటుతో పాటు ఫినిషింగ్ పనులు నిర్వహించాల్సి ఉంది. రెండో అంతస్తుకు పిల్లర్లు వేసి వదిలేశారు. ఈ తరగతులను జెడ్పీహెచ్ స్కూల్ భవనంలో నిర్వహిస్తున్నారు. మామిడికుదురు జెడ్పీహెచ్ స్కూల్‌లో రెండు క్లాస్ రూమ్స్ ఫినిషింగ్ స్టేజ్‌లో ఆగిపోయాయి. పాశర్లపూడి కైకాలపేట ప్రాథమిక పాఠశాల భవనం నిర్మాణం పనులు కూడా అర్ధాంతరంగా ఆగిపోయాయి. ఇక్కడ శ్లాబ్ నిర్మాణం పూర్తయింది. ఆదుర్రు జెడ్పీహెచ్ స్కూల్‌లో మూడు రూములు చివరి దశ పనులు నిలిచి పోయాయి.

నిర్మాణాలు పూర్తి చేయాలి



మధ్యలోనే నిలిచిపోయిన భవన నిర్మాణం పనులను వెంటనే పూర్తి చేయాలి. మా గ్రామంలో ప్రధాన ప్రాథమిక పాఠశాలకు భవనం లేకపోవడంతో ఒకటి, రెండు తరగతులను జెడ్పీహెచ్ స్కూల్లో కొనసాగిస్తున్నారు. చాలా కాలం నుంచి ఈ సమస్య ఉంది. అధికారులు తక్షణం దీనిపై స్పందించి చర్యలు చేపట్టాలి. మధ్యలో నిలిచిపోయిన భవన నిర్మాణం పూర్తి చేసేందుకు కార్యాచరణ చేపట్టాలి.

– బోనం అబ్బులు, లూటుకుర్రు

సదుపాయాలు కల్పించాలి



ప్రభుత్వ స్కూల్స్‌లో విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలను తక్షణం కల్పించాలి. చాలా కాలం నుంచి మా గ్రామంలో ప్రాథమిక పాఠశాల భవన నిర్మాణం నిలిచిపోయింది. దీంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ సమస్యపై ప్రభుత్వం, అధికారులు వెంటనే స్పందించి విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలి.

– వాసంశెట్టి రామకృష్ణ, పాశర్లపూడి

పార్టీని మరింత బలోపేతం చేయండి



జగ్గిరెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసిన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాబి

మామిడికుదురు: రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను విస్మరించి ప్రజల్ని ఏ విధంగా మోసం చేసిందో ప్రజలకు వివరించి వారిలో చైతన్యం తీసుకు రావాలని వైఎస్సార్ సీపీ కోనసీమ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి సూచించారు. పార్టీ రాష్ట్ర యూత్ విభాగం ప్రధాన కార్యదర్శిగా నియమితులైన మాకనపాలానికి చెందిన కాంప్రేగుల బాబి బుధవారం జగ్గిరెడ్డిని గోపాలపురంలో మర్యాద పూర్వకంగా కలిశారు. జగ్గిరెడ్డిని శాలువాతో సత్కరించారు. జగ్గిరెడ్డి బాబికి అభినందనలు తెలిపారు. జగ్గిరెడ్డి మాట్లాడుతూ పార్టీ యువజన విభాగాన్ని మరింత బలోపేతం చేయాలని సూచించారు. జగ్గిరెడ్డిని కలిసిన వారిలో పార్టీ నేతలు జె.వాసు, వి.రామారెడ్డి, ఎస్.అయ్యప్ప ఉన్నారు.

వేంకటేశ్వరునికి పూజలు

అయినవిల్లి: మండలంలోని విలసలో వేంకటేశ్వర స్వామికి విశేష పూజలు జరిపారు. ఆలయ ప్రధానార్చకుడు స్వామికి విశేష అభిషేకా లు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన పెంచాలి



మాచవరంలో విత్తనాలు జల్లుతున్న వెంకటేశ్వరరావు, బోసుబాబు

అంబాజీపేట: దేశంలోని వివిధ రాష్ట్రాల్లో రైతులు అనుసరిస్తున్న ప్రకృతి వ్యవసాయ పద్ధతులపై అధ్యయనం చేసి వాటిపై అవగాహన పెంచుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి వి.బోసుబాబు అన్నారు. మాచవరం శివారు పోతాయిలంకలో ఏరువాక పౌర్ణమి కార్యక్రమాన్ని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు వ్యవసాయ క్షేత్రం నందు బుధవారం నిర్వహించారు. ఎంపీపీ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రైతుల పటల, వ్యవసాయం పట్ల రాష్ట్ర ప్రభుత్వం దుర్మార్గంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. అనంతరం మండల వ్యవసాయాధికారి సీహెచ్‌డీ విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో తొలకరి జల్లులు ఆగమనంతో అరక దున్ని, పొలం పనులను ప్రారంభించారు. వ్యవసాయ పనులు ప్రారంభించేందుకు పూజ చేశారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా పీఎండీఎస్ విత్తనాలను పొలంలో చల్లారు. కార్యక్రమంలో జేడీ పశుసంవర్ధక శాఖ కె.వెంకటేశ్వరరావు, ఏడీ ఎల్.విజయరెడ్డి, రైతులు, ఏఈఓలు డి.దుర్గారావు, పి.జాబేజ్‌శాస్త్రి, వీహెచ్ఏలు, వీఏఏలు పాల్గొన్నారు.

ఉత్సాహవంతులైన యువతతోనే ప్రగతి



విజేతలకు కప్, ప్రైజ్‌మనీ అందజేస్తున్న జగ్గిరెడ్డి, విజయలక్ష్మి, శ్రీనివాసరావు

అయినవిల్లి: ఉత్సాహవంతులైన యువతతోనే గ్రామాల్లో ప్రగతి సాధ్యపడుతుందని, అటువంటి ఉత్సాహం క్రీడలతోనే సాధ్యపడుతోందని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు చిర్ల జగ్గిరెడ్డి, అమలాపురం పార్లమెంట్ పరిశీలకురాలు జక్కంపూడి విజయలక్ష్మి అన్నారు. మంగళవారం రాత్రి అయినవిల్లి పెదపాలెంలో దేవరపల్లి గౌతమ్, దంగేటి శ్రీ ప్రసాద్, జల్లి గోపిల ఆర్గనైజింగ్ ఏర్పాటు చేసిన అంబాజీపేట మండల వైఎస్సార్ క్రికెట్ టోర్నమెంట్‌లో విన్నర్స్‌గా నిలిచిన జట్టుకు కప్పు, ప్రైజ్‌మనీ బహుమతిగా జగ్గిరెడ్డి, విజయలక్ష్మి, పి.గన్నవరం నియోజక వర్గ వైఎస్సార్ సీపీ కోఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు చేతుల మీదుగా అందజేశారు. వీరు మాట్లాడుతూ రాష్ట్రం ప్రగతి పథంలో ఉండాలంటే యువత ముందుకు రావాలన్నారు. యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. ఇటువంటి క్రికెట్ టోర్నమెంట్లను గ్రామాలు, మండల, నియోజక వర్గ, పార్లమెంట్, జిల్లా స్థాయిలలో నిర్వహిస్తే యువత ముందుకు వస్తారన్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హయాంలో యువతలో క్రీడల పట్ల ఆసక్తి పెంపొందించేలా 'ఆడుదాం ఆంధ్రా' వంటి కార్యక్రమాలను తీసుకొచ్చారని గుర్తు చేశారు. యువతలో స్ఫూర్తికి ఇటువంటి క్రీడలు అవసరమన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే పాముల రాజేశ్వరీదేవి, రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనువాసరావు, కుడిపూడి భరత్ భూషణ్, జెడ్పీటీసీ బూడిద వరలక్ష్మి, వైఎస్సార్ సీపీ అంబాజీపేట మండల శాఖ అధ్యక్షుడు విత్తనాల శేఖర్, దొమ్మేటి సత్యమోహన్, ముత్తాబత్తుల మణిరత్నం తదితరులు ఉన్నారు.

దోమల నిర్మూలనతోనే మలేరియా నివారణ



ఆదుర్రులో నిర్వహించిన అవగాహన ర్యాలీ

మామిడికుదురు: దోమల నిర్మూలనతోనే మలేరియా నివారణ సాధ్యమవుతుందని హెల్త్ అసిస్టెంట్ కె.ఉమామహేశ్వరరావు పేర్కొన్నారు. లూటుకుర్రు పీహెచ్‌సీ పరిధిలోని ఆదుర్రులో బుధవారం మలేరియాపై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. నివాస గృహాల పరిసరాల్లో మురికి నీటి గుంటలు లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. దోమల ద్వారానే మలేరియా వ్యాప్తి చెందుతుందన్నారు. దోమల నియంత్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మలేరియా లక్షణాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు. మలేరియా అంతం మనతోనే నినాదంతో ర్యాలీ జరిగింది. కార్యక్రమంలో ఏఎన్ఎం వైకేడీ నాగలక్ష్మి, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఘనంగా సప్తనదీ తీర్థ మహా జ్యేష్ఠాభిషేకం



పూర్ణాహుతిలో పాల్గొన్న ఎమ్మెల్యే దేవ వరప్రసాద్, ఏసీ వి.సత్యనారాయణ తదితరులు

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి దేవస్థానంలో బుధవారం జ్యేష్ఠ పూర్ణిమ, జ్యేష్ఠా నక్షత్ర మహా పర్వదినం సందర్భంగా లక్ష్మీనృసింహుని మూలవిరాట్‌కు అర్చకులు, వేదపండితులు సప్తనదీ తీర్థ మహా జ్యేష్ఠాభిషేకం ఘనంగా నిర్వహించారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ వి.సత్యనారాయణ ఆధ్వర్యాన ఆలయ ప్రధాన అర్చకుడు పాణింగిపల్లి శ్రీనివాస కిరణ్, స్థానాచార్య వింజమూరి రామ రంగాచార్యుల పర్యవేక్షణలో అర్చకులు, పండితులు వేదమంత్రాలతో నిర్వహించారు.

సప్తనది జలాలతో..

గంగా, యమున, సరస్వతి, గోదావరి, నర్మద, సింధు, కావేరి పుణ్యనదుల్లోని పవిత్ర జలాలతో స్వామివారి మూల విరాట్‌కు అర్చకులు విశేష అభిషేకం నిర్వహించారు. ఆలయ చైర్మన్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ రాజా కలిదిండి కుమార రామగోపాల రాజా బహద్దూర్ ఆనవాయితీగా ఆయా విశేష పూజల్లో పాల్గొన్నారు. వేకువ జామున అర్చకులు విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం నిర్వహించారు. అనంతరం అర్చకులు దీక్షాధారణ చేపట్టి, సప్తనదీ కలశ ఆవాహనాలు, ఆరాధనాలు, విశేష అర్చనలు, అగ్నిమథనం చేసి, కలశలతో ఆలయ ప్రదక్షిణ చేశారు. తదనంతరం సప్తనదీ జలాలతో, చతుర్దశ, నవ, పంచామృత కలశాలతోను స్వామివారి మూలవిరాట్‌కు సప్తనది తీర్థ మహా జ్యేష్ఠాభిషేకం నిర్వహించి, స్వామికి విశేష అర్చన చేశారు.

మహాశాంతి హోమం

శ్రీవారికి ప్రీతికరమైన అప్పాలు, పాయసం, మారేడు దళాలు, ఆవు నెయ్యి తదితర వాటితోను, అమ్మవారికి ప్రీతికరమైన తామర, మోదుగ పుష్పాలతోను, తెల్ల ఆవాలు, ధాన్యం, తేనెతోను మహాశాంతి హోమం వైఖానస ఆగమ శాస్త్ర ప్రకారం ప్రధాన అర్చకుడు శ్రీనివాస కిరణ్, స్థానాచార్య రామరంగాచార్యులు, అర్చకులు నిర్వహించారు. అర్చకుల వేదమంత్రాల మధ్య సుగంధ ద్రవ్యాలను పూర్ణాహుతిలో రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్, ఆలయ చైర్మన్, ఫౌండర్ ఫ్యామిలీ మెంబర్ రామ గోపాలరాజా బహద్దూర్, అసిస్టెంట్ కమిషనర్ సత్యనారాయణ దంపతులు, ఏపీ మార్క్‌ఫెడ్ డైరెక్టర్ గుండుబోగుల నరసింహారావు సమర్పించారు. ఎంపీపీ వీరా మల్లిబాబు, ఎంపీటీసీ బైరా నాగరాజు, సర్పంచ్ కొండా జాన్‌బాబు పాల్గొన్నారు. అనంతరం స్వామివారికి నీరాజన మంత్రపుష్పాలు, మంగళా శాసనం, తీర్థగోష్ఠి, భక్తులకు ఆశీర్వచనాలు, పండిత సత్కారం, ప్రసాద వినియోగం నిర్వహించారు. సూపరింటెండెంట్ పి.విజయ సారథి, ప్రజాప్రతినిధులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ముగిసిన ఆలయ వార్షికోత్సవాలు



మహాపూర్ణాహుతి నిర్వహిస్తున్న భక్త దంపతులు

కొత్తపేట: స్థానిక బొరుసువారి సావరంలో వేంచేసిన విజయ కనకదుర్గాదేవి అమ్మవారి ఆలయ వార్షికోత్సవ వేడుకలు బుధవారం ఘనంగా ముగిశాయి. ఆలయ పునర్నిర్మాణకర్త, ఆలయ పోషకుడు బొరుసు వెంకట ఉదయ భాస్కర్–వసుధ దంపతుల ఆధ్వర్యంలో ఆలయ అర్చకుడు బిక్కవోలు సత్యనారాయణ, వేద పండితులు బ్రహ్మశ్రీ బిక్కవోలు అనంత లక్ష్మణకుమారాచార్యులు బ్రహ్మత్వాన ఈ నెల 9 నుంచి ఆలయ వార్షికోత్సవాలు ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు వివిధ పూజలు, హోమాలు, దుర్గామల్లేశ్వర స్వామివార్ల కళ్యాణం తదితర కార్యక్రమాలు వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో కొత్తపేట పరిసర ప్రాంతాల నుంచి అత్యధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కేశవదాసుపాలెంలో గ్యాస్ లీకేజీ



కేశవదాసుపాలెం బెల్లంకొండ వారి మెరకలో బుడగల రూపంలో లీకవుతున్న గ్యాస్

సఖినేటిపల్లి: మండలంలోని కేశవదాసుపాలెం శివారు బెల్లంకొండ వారి మెరకకు సమీపంలో బుధవారం ఓఎన్జీసీ గ్యాస్ పైపులైను నుంచి గ్యాస్ లీకయింది. అంతర్వేదికరలోని ఓఎన్జీసీ బావి నుంచి గ్యాస్ సరఫరాకు ఇటీవల కొత్తగా కేశవదాసుపాలెం బెల్లంకొండ వారి మెరక మీదుగా మోరి గ్యాస్ కలెక్షన్ స్టేషన్(జీసీఎస్)కు పైపులైను అధికారులు వేశారు. ఇళ్లకు సమీపంలో వరి చేలల్లో వెళ్లిన గ్యాస్ పైపులైను నుంచి గ్యాస్ బుడగల రూపంలో లీక్ అవుతున్నట్టుగా పసిగట్టిన నివాసితులు వెనువెంటనే సదరు సంస్థ అధికారులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు సిబ్బంది స్పందించి గ్యాస్ లీకేజీని త్వరితగతిన అరికట్టే ప్రయత్నాలు మొదలు పెట్టారు. ఇందులో భాగంగా ఆయా బావుల పైపులైన్లు నుంచి గ్యాస్ సరఫరాను నిలుపుదల చేసేందుకు, అంతర్వేదికర గ్రామంలో ఉన్న బావుల నుంచి మోరి జీసీఎస్‌కు వెళ్లే అన్ని పైపు లైన్లలో గ్యాస్‌ను బంద్ చేసే విధంగా సిబ్బంది పనులు చేపట్టారు.

రోగికి ఆర్థిక సాయం



సఖినేటిపల్లిలో గాయత్రి కుటుంబ సభ్యులకు సాయం చేస్తున్న పాస్టర్ తదితరులు

సఖినేటిపల్లి: సఖినేటిపల్లికి చెందిన కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్ రోగి అత్తిలి సాయిగాయత్రికి బుధవారం కువైట్ కేంద్రంగా ఉన్న యేసు క్రీస్తు కృపా సంఘం నిర్వాహకులు రూ.10 వేల ఆర్థిక సాయం చేశారు. ఈ మేరకు పై సాయాన్ని పాస్టర్ నవరత్నం, ఎస్.శ్యామ్ సుందర్, తాడి సహదేవ్ చేతుల మీదుగా రోగి కుటుంబ సభ్యులకు ఇచ్చారు.

శానపల్లిలంకలో 'కథాకళి' సినిమా సందడి



కథాకళి చిత్రానికి క్లాప్ కొట్టి ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, వెంకటేశ్వరరావు

అయినవిల్లి: మండలంలోని శానపల్లిలంక గ్రామంలో కథాకళి మూవీ షూటింగ్‌ను బుధవారం ప్రారంభించారు. షూటింగ్ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ, బీజేపీ పి.గన్నవరం నియోజవర్గం అసెంబ్లీ కన్వీనర్ చీకురుమెల్లి వెంకటేశ్వరరావు హాజరయ్యారు. ఎమ్మెల్యే గిడ్డి మూవీకి ముహూర్తం షార్ట్ క్లాప్ కొట్టి ప్రారంభించారు. కథాకళి మూవీ టీమ్ విజయవంతంగా సినిమా నిర్మించాలని ఆశీర్వదించారు. కార్యక్రమంలో నిర్మాతగా కలిదిండి రవికిరణ్, డైరెక్టర్‌గా ప్రసన్నకుమార్ నాని వ్యవహరిస్తున్నారు. సంగీత దర్శకుడిగా పవన్ అలాగే సినిమా నటీనటులుగా బ్రహ్మాజీ, యశ్వంత్ పెండ్యాల, దామరాజు మధుప్రియ, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్ ఉపేంద్ర కున ఉన్నారు. గ్రామంలో లోకల్ ప్రొడక్షన్ దుర్గారావు, కాశి సురేష్, ప్రొడక్షన్ టీం సందడి చేశారు.

రైతు పూజ్యనీయుడు



ఇరుసుమండలో రైతులను సన్మానించిన సతీష్

అంబాజీపేట: ప్రతి రోజూ ప్రజలందరికీ పట్టెడు అన్నం పెట్టే రైతు అందరికీ పూజ్యనీయుడని కోనసీమ ఆహార నిధి వ్యవస్థాపక అధ్యక్షుడు వీరంశెట్టి సతీష్ అన్నారు. ఏరువాక పౌర్ణమి సందర్భంగా ఇరుసుమండలో సతీష్ ఆధ్వర్యంలో రైతు పూజోత్సవం బుధవారం నిర్వహించారు. ఏరువాకకు పూజలు నిర్వహించి దుక్కి దున్నారు. అనంతరం రైతులను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో వీరంశెట్టి రామకృష్ణ పరమహంస, ఆకెళ్ల బుజ్జి, బండారు సురేష్ పాల్గొన్నారు.

మోరిపోడులో ఏరువాక పౌర్ణమి



మోరిపోడులో ఏరువాక పౌర్ణమికి శ్రీకారం చుడుతున్న సర్పంచ్ గంగాత్రివేణి

సఖినేటిపల్లి: మండలంలోని మోరిపోడులో బుధవారం ఏరువాక పౌర్ణమి కార్యక్రమం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ముఖ్య అతిథిగా సర్పంచ్ ముప్పర్తి అలివేలు గంగాత్రివేణి పాల్గొన్నారు. ఈ మేరకు ఒక రైతు పొలంలో కాడిఎడ్లతో ఉన్న నాగలి పట్టుకొని దుక్కిదున్ని, ఏరువాక పౌర్ణమికి శ్రీకారం చుట్టారు. రైతులకు వ్యవసాయంకు సంబంధించిన కిట్లను ఆమె పంపిణీ చేశారు. రైతులు అందరూ పాడిపంటలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. ఏఓ పీవీ నరసింహారావు, మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు ముప్పర్తి నాని, సిబ్బంది, ప్రజా ప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

జాతీయ తైక్వాండో పోటీలకు క్రీడాకారుల ఎంపిక



జాతీయ తైక్వాండో పోటీలకు అర్హత సాధించిన క్రీడాకారులు

రాజోలు: రాష్ట్రస్థాయి తైక్వాండో చాంపియన్‌షిప్–2025 పోటీల్లో ప్రతిభ చూపిన రాజోలుకు చెందిన ఎనిమిది మంది క్రీడాకారులు జాతీయ తైక్వాండో పోటీలకు ఎంపికయ్యారు. ఈ మేరకు కోచ్ రాయుడు మణికంఠ బుధవారం వివరాలు వెల్లడించారు. ఈ నెల 9వ తేదీ నుంచి అనంతపురం జిల్లా తాడిపత్రిలో జరుగుతున్న రాష్ట్రస్థాయి పోటీల్లో వై.గంగాభవానీ, జి.దినేష్‌ఆదిత్య, కె.దివ్య తేజ వెంకటేష్‌లు బంగారు పతకాలు సాధించగా, వై.శశిరేఖ వెండి పతకం, కె.ధాత్రిజ, ఎ.హేమ సత్యశ్రీ, ఎం.భువనేష్‌లు రజత పతకాలు సాధించారన్నారు. జాతీయ స్థాయిలో జరిగే పోటీలకు వీరంతా అర్హత సాధించడం అభినందనీయమన్నారు. జాతీయ స్థాయి పోటీలకు క్రీడాకారులను తీర్చిదిద్దిన సీనియర్ కోచ్ రాయుడు మణికంఠ, జూనియర్ కోచ్ బండారు కరుణకుమార్‌ను పలువురు అభినందించారు.

గోపాలస్వామికి ప్రత్యేక పూజలు

కొత్తపేట: ఆత్రేయపురం మండలం ర్యాలి జగన్మోహినీ కేశవస్వామివారి ఆలయ ప్రాంగణంలో వేంచేసిన గోపాలస్వామివారికి బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోపాలస్వామివారి కల్యాణోత్సవాల్లో భాగంగా బుధవారం దేవస్థానం ఈఓ భాగవతుల వెంకటరమణమూర్తి ఆధ్వర్యంలో అర్చకులు, వేదపండితులు పూజలు నిర్వహించారు.

అన్నదాన పథకానికి విరాళాలు

ర్యాలి జగన్మోహినీ కేశవస్వామి, గోపాలస్వామి దేవస్థానం అన్నదాన పథకానికి పలువురు భక్తులు విరాళాలు సమర్పించారు. దెందులూరు మండలం సీతంపేటకి చెందిన సుంకర మహేష్‌కుమార్–జ్యోత్స్న దంపతులు రూ.10,116, అమలాపురం మండలం బండార్లంకకి చెందిన భోజనపల్లి కేశవకృష్ణ–రత్నమాల దంపతులు రూ.10,116 అందించారు. దాతలకు వేదాశీర్వచనం, స్వామివారి చిత్రపటాన్ని అందజేశారు. అలాగే హైదరాబాద్‌కు చెందిన కొడుకుల నరసింహారావుశర్మ–శశిరేఖ దంపతులు రూ.5,116 విరాళం ఆన్‌లైన్ ద్వారా సమర్పించారు.